# చావడానికి పర్మిట్

'పో. శా.'

నేను చాలా రోజుల్నుంచీ అనుకుంటున్నాను చచ్చిపోవాలని. చచ్చిపోవాలి, అంతే, ఇంకేమీ చెయ్యకూడదు. ఈ విషయం నా అంతరాత్మతో చెప్పేశాను.

'భార్యాబిడ్డలో?' అని ప్రశ్నవచ్చింది అంతరాత్మకు.

'భార్య పునర్వివాహం చేసుకుంటుంది. బిడ్డలు నా పోర్ట్‌ఫోలియో పుచ్చుకున్న వాడిని-కొంచెం జంకినా తరువాత-నా-న్నా అంటారు.'

'బంధువులంతా లబోదిబోమనరూ?'

'బ్రతికున్నప్పుడు వెలగబెట్టారూ?'

'అసలంత అఘాయిత్యం ఎందుకూ?'

'అబ్బ! ఏం చెప్పేది? హృదయమంతా చెయిపెట్టి కలచిపారేసినట్టయింది.'

'ఏం?'

'నీతో కాబట్టి చెబుతున్నా. ఇద్దరు పిల్లల్ని కన్నాక అందుండే-అది-ముట్టుకోనివ్వడంలేదు.' అని ముక్కు తుడుచుకున్నాను.

'ఏమొచ్చిందీ?'

'ఆఁ! గ్లామర్ తగ్గుతోందట.'

'నీమీద యిష్టం తగ్గిపోయిందేమో!'

సిగ్గుపడ్డాను. 'కాదు. చాలా మంచిదే.'

'......'

'మా నాన్న ఏమీ సంపాయించడం లేదేంరా అని రోజూ మొహాన్న అడిగేస్తున్నాడు.'

'.....'

'మిత్రులంతా హేళనచేస్తున్నారు. క్షురం గుడిచెనా దాకాకు లోపంలేదుట.'

'అందుకని చచ్చిపోతావ్?'

'ఎలాగైనా యీ దేహం అశాశ్వతమేగా!'

'రోజూ పురాణం శాస్త్రుల్లు చెప్పింది బాగా తలకెక్కిందీ?'

'వేరే గత్యంతరంలేదు.'

'వద్దు, చెబుతున్నా విను.'

'నన్నాపమాకు. నీకో దణ్ణం'

ఇంతసేపూ అంతరాత్మతో వాదించింది వింటూనే ఉన్నారుగదా! సరే ఎందుకులెండి యీ సోదంతా. కాలం కర్మం కలిసొచ్చింది కనుకనే నేను చావదలుచుకున్నాననుకోండి. ఇన్నివిధాల ప్రాణం కష్టపడుతూంటే నా శరీరంమీద అధికారమున్న నేనే చావాలనుకోడం తప్పేమిటి? మృత్యువు నారాధించాను.

సరి, జరిగిందేదో జరిగింది. నేను చచ్చిపోయాను.

★

'ఏయ్ శివుడా! ఏమిటిక్కడికెలా వచ్చావ్! కుశలమే?'

ఆఁ! ఎవరు? యోగక్షేమాలు కనుక్కుంటున్నారెందుకూ?—ఏం మాట్లాడలేదు.

'ఎలా వచ్చావిక్కడికి?' మళ్లీ అదే గొంతు.

వెనకాలనుంచి నా భుజంమీద చెయ్యేస్తూ ఒక కిరీటం మనిషి (మనిషేనా?) నన్ను పలుకరించాడు. యముడే!

ఇదేంఖర్మయ్యా! మా పురాణంలో ఎప్పుడూ యముడిలా అడుగుతాడనిలేదే! లేకపోతే యిది స్వర్గమా? అయితే అప్సరసలు స్వాగతమివ్వాలిగా! ఇలా యమలోకానికి వస్తానని తెలిస్తే నా చావును వాయిదావేసేవాడినిగా...యముడు మంచివాడే-పాపం యముడు ట్రాన్స్ఫరయ్యాడేమో!

'చచ్చిపోయి వచ్చానండి'

'ఎందుకు చచ్చిపోయావ్?'

మళ్ళీ యిక్కడా యిదే ప్రశ్న? ఈ శంతనాలగోలంతా దేనికి వీడికి? ఏమీ చెప్పలేదు.

'జీవుడా! ఇక్కడికి రావడానికి కారణం?'

'ఆత్మహత్య చేసుకున్నాను'

'ఎందుకు?'

మళ్ళీ అదే ప్రశ్న, ఇకాగలేకపోయా.

'మరి మీ చిత్రగుప్తుడేమి చేస్తున్నాడయ్యా యేమీ తెలియబరచకుండా?'

అటూ యిటూ చూశాను. కోరలు పెంచిన యమభటులు రెండుపక్కలా విచ్చుకత్తులు పట్టుకొని నిల్చున్నారు. ఓయి బాబో-ఇక జాగ్రత్తగానే మాట్లాడుతాను. అదుగో! దూరంగా కాగుతున్న నూనెతొట్టి...

'భూలోకవిశేషాలేమిటి?.

పాపపుణ్యాలవిచారణ మానేశాడేమిటి!

'ఆఁ ఏమున్నాయ్యండి! అంతా కులాసా.' సమాధానమిచ్చాను. సర్వసామాన్యంగా అంతేగా!

'ఊరికే వచ్చావా?'

'......'

'అమల్లో ఉన్నచట్టం తెలియనట్లే ఉందే!'

చట్టం! నాకు తెలియదూ! రోజూ పేపర్లు చూస్తూనే ఉంటానే!

'ఆ చట్టం ఎవరూ చావకూడదు-అని'

తలతిరిగి పడి-పో-తా-నా? చావడానికి కూడా చట్టాలేనా. ఏవేవో అడిగాడుగాని నాకు వినిపిస్తేనా?

'యమధర్మరాజా!...' అడుగుదామనుకున్నానసలు యీ చట్టానికి ఆరిజిన్ ఏమిటో, ఏమనుకుంటాడో. అనుకుంటే అనుకున్నాడులే.

'...ఈ చట్టం అసలెందుకు...'

'మీ దేశంలో బర్త్‌కంట్రోలు ఎక్కువైపోయింది.'

బర్త్ అనేసరికే పై ప్రాణం పైనపోయింది. అంటే యీ చట్టానికి నేనే బలి అవుతానన్నమాట!

'కర్మకాలం తీరినతరువాతకూడా జీవులు యీ లోకంలోనే ఉండిపోవాలిసివస్తోంది. బ్రహ్మవ్రాత నిష్ఫలమౌతోంది. మరి యిక్కడ ఇన్ఫ్లేషన్ తప్పదన్న భయం పుట్టడంమూలాన్న యీ చట్టం అమలుజరుపుతున్నా. పర్మిట్లు లేనిదే ఎవరూ చావరాదు' అన్నాడు యముడు.

'పర్మిట్లు ఎవరిదగ్గర...' కొంత దగ్గుతిక పడింది.

'నీ జీవితయాత్రకు, ప్రపంచానికీ తెగతెంపులయ్యేకాలంవస్తే మావాళ్ళేవచ్చి పర్మిటు యిస్తారు.'

'ఈ చట్టానికి విరుద్ధంగా ప్రవర్తిస్తే?'

'జీవితకాలం పెరుగుతుంది. బహుశా ఒకడు ఒకణ్ణి చంపాడనుకో. ఉరితీసేవాళ్ళు. ఇక్కడికి వచ్చేవాడు. ఇప్పుడలా కాకుండా ఎన్నేళ్ళవాడిని చంపాడో అన్నేళ్ళు ఎక్కువబతకాలి.'

నా సంగతి అడగనా? ఎందుకూ? అభాండం నా తలమీదే పగిలితే చేసేదేముంది.

'నీదగ్గర పర్మిట్ లేదుగా!'

లేదనితలవూపి ఉస్సురన్నాను, మళ్ళీ మాయాలోకమేగతి!

'అయితే వెళ్ళిపో.'

ఏం చేస్తాను. వెనక్కితిరిగాను.

మళ్ళీ మీ మధ్యకు వచ్చిపడ్డాను.

---

[illegible] *